పేదలకు రేషన్ కష్టాలు


ఆధార్ సెంటర్ వద్ద కుటుంబ సమేతంగా లబ్ధిదారుల పడిగాపులు

- ఈ కేవైసీకి లబ్ధిదారుల పరుగు
- సాంకేతిక సమస్యతో పనిచేయని యంత్రాలు
- చేతులెత్తేస్తున్న డీలర్లు.. ఆధార్ సెంటర్లకు జనం తాకిడి

దౌల్తాబాద్: నిరుపేదలకు రేషన్‌కార్డు ఓ ఆధారం. అయితే ఇటీవల కార్డు దారులకు ఈ కేవైసీ (అప్‌డేట్) తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందుకు ప్రతి కుటుంబం నుంచి సభ్యులందరూ చౌకధర దుకాణాల్లో ఈ కేవైసీ చేయించుకోవాలి. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు పరుగు తీస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లాక.. సాంకేతిక సమస్య తలెత్తడం, వేలిముద్రలు అనుసంధానం కాకపోవడంతో ఆధార్ సెంటర్లకు వెళ్లాలంటూ సూచిస్తూ.. డీలర్లు చేతులెత్తేస్తున్నారు. చేసేది లేక జనాలు అక్కడ పడిగాపులు కాస్తున్నారు. మండలంలో 12వేల రేషన్‌కార్డులు ఉండగా.. ఇందులో ఇంకా 25శాతం మంది అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

లబ్ధిదారులతో ఆధార్ సెంటర్ల కిటకిట

ఈ కేవైసీ, ఆధార్ అప్‌డేట్ కోసం జనం ఆధార్ సెంటర్ల వద్ద బారులు తీరారు. ఒకే సారి లబ్ధిదారులు అధిక సంఖ్యలో రావడంతో రోజుకు సుమారు 40 మందికి మాత్రమే అప్‌డేట్ చేయడం వీలవుతుందని, సమయం లేకపోవడంతో సాంకేతిక సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇలా ఈ కేవైసీ చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడం, రేషన్ దుకాణాల్లో టెక్నికల్ సమస్య రావడంతో.. ఆధార్ సెంటర్లలో పడిగాపులు కాస్తున్నామని, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని లబ్ధిదారుల సమస్యకు మార్గం చూపాలని పలువురు కోరుతున్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- వంతెన పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

తాండూరు రూరల్: తాండూరు ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి బొంకూర్–బిజ్వార్ వంతెనతో పాటు ఖాంజాపూర్‌లో చెక్‌డ్యాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బొంకూర్ గ్రామ ప్రజల కల సాకారం కాబోతుందని, బ్రిడ్జి లేక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులకు సీఆర్ఆర్ నిధులు రూ.4.85 కోట్లతో వంతెన నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఖాంజాపూర్ గ్రామ శివారులోని కాగ్నా నదిపై రూ.7.67 కోట్లతో చెక్‌డ్యాం నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ చెక్‌డ్యాంతో భూగర్భ జలాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, బిజ్వార్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాందాస్, రాంలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశం, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

క్లుప్తంగా

'నా భూమి.. నా దేశం'


మట్టిని స్వీకరిస్తున్న సదానంద్ రెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రధాని మోదీ పిలుపు మేరకు పల్లెల నుంచి మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీకి పంపించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డి తెలిపారు. నా భూమి.. నాదేశం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధి ప్రాంతాల నుంచి సేకరించిన మట్టిని సోమవారం ఆయన జిల్లా కార్యాలయంలో స్వీకరించి మాట్లాడారు. ఇక్కడ సేకరించిన మట్టితో హస్తినలో 75 ఎకరాల్లో అమృత వనాన్ని నిర్మించనున్నారని ఆయన పేర్కొన్నారు. ఇందులో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు గౌడ్, శ్రీధర్ రెడ్డి, రాఘవ నాయక్, అమరేందర్ రెడ్డి, నరోత్తం రెడ్డి, మాధవి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు చర్యలు


ఎస్ఐని సన్మానిస్తున్న విశ్రాంత ఏఎస్ఐ

దోమ: పోలీసులు శాంతి భద్రతలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఏఎస్ఐ అంతిరెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రం ఠాణాలో ఎస్ఐ రవిగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలు కావడంతో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు బాల్‌రాజ్, రాములు, భాస్కర్, మల్లారెడ్డి, ప్రభాకర్, మహేశ్, హైమద్, ఫెరోజ్, యాదయ్య ఉన్నారు.

విధుల్లో చేరిన తహసీల్దార్

యాలాల: నూతన తహసీల్దార్‌గా మహ్మద్ మునీరొద్దీన్ సోమవారం విధుల్లో చేరారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పద్మావతి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో విధులు నిర్వహిస్తున్న మునీరొద్దీన్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

పరిగి: ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చెస్తామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని వివిధ కాలనీల్లో రూ.25కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా కృషి చేస్తామన్నారు. ఇదులో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, కౌన్సిలర్లు నాగేశ్వర్, కిరణ్, రవీందర్, వెంకటేశ్, రవికుమార్, మౌలానా, శేఖర్ ఉన్నారు.

బీఆర్ఎస్‌కు మైనార్టీ నేత రాజీనామా

బంట్వారం: బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు హకీం రషీద్ పార్టీ పదవికి, సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన తొర్మామిడిలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. మైనార్టీలకు కల్పిస్తామన్న 12 శాతం రిజర్వేషన్లు నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. అనంతరం ఆయన మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి మాట్లాడారు. త్వరలోనే బహిరంగ ఏర్పాటు చేసి 200 మంది మైనార్టీలతో ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరతానని ప్రకటించారు.

ముదిరాజుల బలోపేతానికి చేపల పెంపకం


శివసాగర్‌లో చేపలను వదులుతున్న ఎంపీపీ తదితరులు

యాలాల: చేపల పెంపకంతో ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. సోమవారం శివసాగర్ ప్రాజెక్టులో ముదిరాజ్‌లతో కలిసి చేపపిల్లలను వదిలి మాట్లాడారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే అనువైన ప్రదేశాల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. జలాశయంలో 2.50లక్షల చేప పిల్లలను వదిలామని, వీటిలో బంగారుతీగ, గ్యాస్‌కట్, పరక జాతికి చెందినవి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు రాములు, కార్యదర్శి అంబరప్ప, డైరెక్టర్లు నర్సింహులు, అంబరప్ప, పట్టా భీములు ఉన్నారు.

భూగర్భ జలాల పెంపునకే చెక్‌డ్యాం

- పంట పొలాలు సస్యశ్యామలం
- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్

తాండూరు రూరల్: భూగర్భ జలాలు పెంపొందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం చెక్‌డ్యాంలను నిర్మిస్తుందని తాండూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పటేల్ ఉమాశంకర్ తెలిపారు. సోమవారం చంద్రవంచ గ్రామం కాగ్నానదిపై రూ.8 కోట్ల 74లక్షలతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెక్‌డ్యాం నిర్మాణంతో పరిసర గ్రామాల రైతుల పొలాలు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. అదే విధంగా రూ.4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని, చంద్రవంచ గ్రామానికి గృహలక్ష్మి కింద 75 ఇల్లు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, రాంలింగారెడ్డి, విజయ్, చంద్రశేఖర్‌రెడ్డి, రవిశంకర్ పటేల్, సాయిలు, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెక్‌డ్యాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉమావంకర్ తదితరులు

సబ్బండ వర్గాలకు బీఆర్ఎస్ అండ

బతుకమ్మ చీరల పంపిణీలో జెడ్పీటీసీ, ఎంపీపీ

కుల్కచర్ల: బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధి మందిపల్ గ్రామంలో క్రీడాకారులకు, మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తమకు మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి స్వరూప, స్థానిక నాయకులు రాజశేఖర్, శంకర్, చెన్నయ్య, విజయకుమార్ ఉన్నారు.



కుల్కచర్ల: యువకులకు క్రీడాసామగ్రిని అందజేస్తున్న జెడ్పీటీసీ రాందాస్ నాయక్

పేదల అభ్యున్నతికి..

పూడూరు: నిరుపేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ మల్లేశం అన్నారు. మండల పరిధి పూడూరు, నిజాంపేట్, మేడిపల్లి, కంకల్ తదితర గ్రామాల్లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో జెడ్పీటీసీ మేఘమాల, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు పెంటమ్మ, జయమ్మ, సంతోష, నవ్య, రాజేందర్ ఉన్నారు.

సెలవుల అనంతరం 'అల్పాహారం'

- విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి
- మండల విద్యాధికారి హరిశ్చందర్

దోమ: విద్యార్థుల కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అల్పాహారం పథకాన్ని దసరా సెలవుల అనంతరం యథాప్రకారంగా కొనసాగించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించేలా చూడాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పలువురు ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని, వారి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, యూడైస్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎస్ఏ1 పరిక్ష మార్కుల జాబితాను ఎంట్రీ చేయాలని చెప్పారు. ఆధార్ ఎన్‌రోల్మెంట్‌ను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకట్, లాల్యా నాయక్, శ్రీనివాస్, రాములు, పలువురు ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలి**

పరిగి: అర్హులకు డబుల్‌బెడ్‌రూంలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. పట్టణ కేంద్రంలో 184, దోమలో 30, చౌడాపూర్‌లో 34 ఇలా నిర్మించిన ఇళ్లు వృథాగా ఉన్నాయని, అర్హులకు కేటాయించాలని కోరారు. ఇందులో నాయకులు హబీబ్, రఘురాం, శేఖర్ ఉన్నారు.

◆ **కలిసి మెలిసి ఉండాలి**

తాండూరు రూరల్: ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలని కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఓగిపూర్ గ్రామంలో వికారాబాద్ పోలీస్ కళాజాత బృందంతో అవగాహన సదస్సు నిర్వహించగా.. ఎస్ఐ మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఇందులో సర్పంచ్ పద్మమ్మ, ఉప సర్పంచ్ హుసేనప్ప, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

◆ **సన్మానం..**

మర్పల్లి: పోలీసు ఉద్యోగానికి ఎంపికైన పట్లూర్ గ్రామ వాసి దేవరదేశి ప్రజ్ఞను మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు సన్మానించారు. ప్రస్తుత పోటీ తత్వంలో గ్రామీణ ప్రాంతంలో చదువుకుని పోలీస్ కొలువు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

◆ **కైఫ్‌కు అభినందనలు**

కొడంగల్ రూరల్: కానిస్టేబుల్‌గా ఎంపికయిన విద్యార్థి కైఫ్‌ను సోమవారం నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ యాజమాన్యం సన్మానించింది. ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ మాట్లాడుతూ 2018విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన కైఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- పక్కాగా గ్యారంటీ పథకాల అమలు
- అధికారమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలి
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

పరిగి/మర్పల్లి/బొంరాస్‌పేట: 'రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సీఎం కేసీఆర్ అవినీతి పాలనను ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న బీఆర్ఎస్.. తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని పూర్తిగా దోచేసింది. కేసీఆర్‌ను గద్దె దించే రోజులు దగ్గర పడ్డాయి' అని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, అనంతరం అధిష్టానం ప్రకటించిన పథకాలు అమలు అవుతాయని పరిగి మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి అన్నారు. ఎక్కడ చూసినా కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, పేదల సంక్షేమమే పార్టీ ధ్యేయమని, భారీ మెజార్టీతో గెలుపించుకోవాలని, ఆ దిశగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అనార్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా గోపాల్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు తౌర్యనాయక్, పార్టీ నాయకులు విఠల్ నాయక్, కృష్ణారెడ్డి, మల్లేశ్, నర్సింహులు ఉన్నారు.


పరిగి: కర పత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

మర్పల్లిలో..

వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలు జరిగి, పేదలకు మేలు జరగనుందని, వారి జీవితాలు బాగుపడుతాయని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల సంజీవరెడ్డి అన్నారు. మర్పల్లి మండలం పిల్లిగుండ్ల గ్రామంలో ఇంటింటికీ తిరిగి, గ్యారంటీ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చిందని, ఇక బీఆర్ఎస్ ప్రభుత్వం చేసేదేమీ లేదని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్.. కల్వకుంట్ల కుటుంబీకులకు.. చట్ట సభలకు ప్రాతినిత్యం వహించే విధంగా ఉద్యోగాలు ఇచ్చి, రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇందులో వార్డు మెంబర్లు భరత్ భూషణ్‌రెడ్డి, దశరత్, శ్రీనివాస్, మల్లేశం, రాములు, సర్దార్, మొగులయ్య, మేహన్‌రెడ్డి, విఠల్, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 'ఆరు గ్యారంటీ కార్డులు'

బొంరాస్‌పేట: ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ ప్రకటించిన 'ఆరు గ్యారంటీ కార్డులు' కార్యక్రమం మంగళవారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. ఇందులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఉన్నారు.

సర్కారు బడికి సాయం

తాండూరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలకు తమ సంస్థ తరపున సాయం చేయనున్నట్లు రాడికల్ బయో ఆర్గానిక్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీజేసీ)లో రూ.92 వేలతో తాగునీటి కోసం మోటారు బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల కోసం, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంస్థ ఆధ్వర్యంలో సహాయం చేయనున్నట్లు తెలిపారు. మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ మనఊరు–మనబడితో విద్యాలయాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. అదనంగా దాతలు సాయం చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల కోసం బోరు వేయించిన ఆర్బీఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సహాయం

పెద్దేముల్: తింసాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుర్వ హన్మంతు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సందుల ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకుడు (న్యాయవాది) ఎల్లారెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో మండల కో–ఆప్షన్ సభ్యుడు నజీర్, ముదిరాజ్ సంఘం మండల నాయకుడు శ్రీనివాస్ ఉన్నారు.

క్యాన్సర్ బాధితుడికి..

కుల్కచర్ల: మండల కేంద్రానికి చెందిన వార్వాల అంజిలయ్య కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితులతో సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసానీ వీరేశ్ ముదిరాజ్ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబీకులకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. ఇందులో టీడీపీ రాష్ట్ర నాయకుడు బాలముకుందం, ముదిరాజ్ సంఘం పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు వెంకటేశ్, పుల్లయ్య, భీమయ్య, రమేష్, చెన్నయ్య, రవి కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

పనిచేసేవారికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండలం పలుగుతండా గ్రామ పంచాయతీ హన్మతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో అధికార పార్టీలో చేరగా.. వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందులో జెడ్పీటీసీ నాగిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి ఉన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వాల్‌పోస్టర్లు, బ్యానర్ల తొలగింపు


పెద్దేముల్: వాల్ పోస్టర్లు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది


కొడంగల్ రూరల్: చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రాములు

- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు: అధికారులు
- వాహనాల తనిఖీలు విస్తృతం చేసిన పోలీసులు

పెద్దేముల్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఎన్నికల కమిషన్.. ఎన్నికల కోడ్ అమలులోకి తెచ్చింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయింది. గోడలపై ఉన్న పోస్టర్లు, బ్యానర్లను తొలగించడం మొదలు పెట్టింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నాయకులు, ఓటర్లు సహకరిచాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాజిరెడ్డి కోరారు.

బెల్కటూర్‌లో..

తాండూరు రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల పరిధి బెల్కటూర్‌లో సర్పంచ్ ఏర్పాటు చేసిన బ్యానర్లను పంచాయతీ సిబ్బంది తొలగించారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తారాసింగ్ హెచ్చరించారు.

నిబంధనల ప్రకారం..

కుల్కచర్ల: ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఎవరూ ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు అతికించరాదని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, పార్టీల జెండాలను తొలగించారు.

పోలీస్ చెక్‌పోస్టుల ఏర్పాటు

కొడంగల్ రూరల్: ఎన్నికల నేపథ్యంలో సీఐ రాములు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. నియోజకవర్గం కర్ణాటక సరిహద్దు రావులపల్లి, చంద్రకల్‌తో పాటు దుద్యాల, గోకఫస్లాబాద్ గ్రామాల రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృత సోదాలు చేపడతామన్నారు. నిత్యం చెక్‌పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

సారూ.. ఇదేమి రోడ్డు?

వికారాబాద్ అర్బన్: ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు మున్సిపల్ పరిధి 8,9వ వార్డులు మద్గుల్ చిట్టంపల్లి, బూర్గుపల్లికి వెళ్లే మార్గం. అంతే కాదు ఈ రహదారి గుండా వికారాబాద్ నుంచి పరిగి, పరిగి నుంచి వికారాబాద్‌కు రాకపోకలు అధికంగా ఉంటాయి. ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉండే ఈ దారిలో గుంతలు ఏర్పడి ప్రయాణికులు, బాటసారులకు ఇబ్బందిగా మారింది. దీంతో కొందరు స్థానికులు మాట్లాడుతూ.. 'సారూ.. ఇదేమి రోడ్డు?. ఈ రోడ్డెంట పగటి పూట వెళ్లలేక పోతున్నం. ఇక రాత్రయిందంటే ప్రమాదాలు జరుగుతున్నయ్' అని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయించాలని కోరుతున్నారు


బూర్గుపల్లి గేటు సమీపంలో రోడ్డు దుస్థితి

బిల్లుల జాప్యంతో అప్పులపాలు

- కార్మికుల ఇబ్బంది పట్టించుకోని ప్రభుత్వం
- మధ్యాహ్న భోజన కార్మికులు

కొడంగల్ రూరల్: బిల్లుల జాప్యంతో కిరాణా దుకాణాల్లో అప్పు పేరుకుపోతోందని, దీంతో యజమాని నిత్యవసరా సరుకులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. డిమాండ్ల సాధనకోసం వారు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం నాటికి 12రోజులకు చేరుకుంది. అందులో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వారు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని, ఉచిత సిలిండర్లను అందిస్తూ, నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, పింఛన్‌తో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. నిరసనలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, సంఘం జిల్లా కార్యదర్శి వెంకటలత, నియోజకవర్గ అధ్యక్షురాలు లక్ష్మి, పద్మ, ఆశమ్మ, సుజాత, సాజిదాబేగం తదితరులు పాల్గొన్నారు.


మోకాళ్లపై కూర్చొని నిరసనలు వ్యక్తం చేస్తున్న కార్మికులు